# ఆమె నవ్వింది — రాజు

బస్సు ఇంకా రాలేదు.

అందరు బస్సు కొరకు ఎదురు చూస్తున్నారు. నేను మాత్రము ఎదురుచూడడము లేదు. బస్సు ఆలస్యంగా వస్తేనే, నాకు బాగుంటుంది. ఆమెను చూస్తూ ఉండవచ్చు.

ఆమె నన్ను చూసింది. నేను ఆమెను ఎప్పటినుండో చూస్తున్నాను. మా ఇద్దరి కళ్ళు ఏమో చెప్పుకున్నాయి.

ఆమె నవ్వింది.

ఆమె కన్నులు నవ్వాయి.

ఆమె జడలో పువ్వులు నవ్వాయి.

నేను నవ్వాను

నా మనసు నవ్వింది.

మేమిద్దరము. చాలా రోజులనుండి ఈ బస్సు "స్టాపు" లో కలుసుకుంటున్నాము. ఆమె బ్యాంకునుండి వస్తుంది. నేను కాలేజీ నుండి వస్తాను.

ఇద్దరిది ఒకే బస్సుస్టాండు.

ఇద్దరిది ఒకే బస్సు.

ఇద్దరిది ఒకేమనసు ....!

ఏమో ! ఆమె మనసు నాదో, కాదో !— అలా కాదనుకుంటే భయం.

కాను !.... భయమెందుకు ?.... ఆమె ఎవరు ?.... నాకేమవుతుంది ?

"ఛ !.... ఇవేం ఆలోచనలు .... ఆమె ఎవరో కాదు !.... ఎవరో మాత్రం కాదు.

ఎవరో అని ఎందుకనుకోవాలి ! నన్ను చూస్తుంది. ముసి ముసి నవ్వుల పువ్వులు వెదజల్లుతుంది. చల్లని చూపుల వెన్నెల కురిపిస్తుంది. నన్ను మురిపిస్తుంది. నా కొరకు ఎదురు చూస్తుంది.

ఆమెను చూశాను. నవ్వుకుంటోంది. మళ్ళీ నవ్వుల నుండి, పరిమళాలు కురిశాయి.

నా మీద, నా మనస్సు మీద, నా జీవితం మీద, మళ్ళీ ఆలోచనలు.

మా ఇద్దరికి పెళ్ళయితే ! జీవితాంతం, ఆ నవ్వుల పువ్వులు వెదజల్లుకుంటూ, ఎదలో జల్లుకుంటూ, హాయిగా గడుపుతాం.

ఆమె నన్ను చూసింది.

నేను ఆమెను చూశాను.

మళ్ళీ వెన్నెల కురిసింది. పన్నీరు చిలికింది.

అందరు తారలకన్న బాగుంటుంది. ఆకాశ తారలకన్నా బాగుంటుంది పొడుగ్గా వుంది. గాలికి ఊయలలూగే ముంగురులు ఎప్పుడు, మెరిసే కళ్ళు అమృతం చిమ్మే పెదాలు ముచ్చటగా వుంది.

నా జీవితాంతం, ఆమెను చూస్తూ ఆమె కళ్ళలో నా నీడను చూస్తూ ఆమె పెదాలను నా మునివేళ్ళతో తాకుతూ ఉండాలనిపిస్తుంది.

కాని, ఈ సమాజం ఉండనిస్తుందా ....

ఇది కుళ్ళి పోయింది. వయస్సు మళ్ళి పోయింది. మమ్మల్ని వెంటాడుతుంది. కుల, మత భేదాల గోడలు కడుతుంది. అయినా, నేను భయపడను.

ఆమె కోసం.

ఆ నవ్వుల కోసం.

దేన్నయినా ధిక్కరిస్తాను.

ఆమెను నా హృదయములో దాచుకుంటాను

ఆడపిల్లలందరు ఆమెకు దగ్గిరగా నిలుచున్నారు వాళ్ళంతా, రకరకాల ఫ్యాషన్లలో వున్నారు. కాని, అందరిలో ఆమె మిన్నగా

ఉంది.

అందరిలో మెరిసిపోతోంది వెన్నెలలా,

మెరుపు తీగలా

మల్లెలా మెరిసిపోతూంది.

నన్ను చూసి మళ్ళీ ముసిముసిగా నవ్వింది. నామీద పన్నీరు కురిసింది.

నేను నవ్వాను.

బస్సు వచ్చి ఆగింది.

నవ్వులు ఆగిపోయాయి

అందరు గబగబ బస్సు ఎక్కారు.

ఆమె ఎక్కింది.

నేను ఎక్కాను.

బస్సు కదలింది.

బస్సు చాల రద్దీగా ఉంది. అందరిలో నుండి ఆమె కనిపించడము లేదు. చూడటానికి ప్రయత్నిస్తున్నాను. కాని, కనిపించడము లేదు. తప్పకుండ చూడాలి. ఆమె మధ్యలో దిగిపోతుంది. నాకు రెండు నెలలు సెలవులు....రేపే ఊరికి వెళ్ళాలి. అందుకే ఈ రోజు, ఆమెను చూడాలి. ఆ చూపును నేను తిరిగి వచ్చేవరకు దాచుకోవాలి ; ఔను, అన్ని రోజులు, ఆమెను చూడకుండా, ఎలా ఉంటానో ;

"ఆమె, నన్ను చూడకుండా, ఎలా గుంటుందో ; ఏమో ; ఇద్దరికి బాధ ; ఈ సెలవులు ఎలాగో గడిపి, వచ్చాక ఆమెను అడిగెయ్యాలి ;

"ఏమని అడగాలి ;"

నన్ను తన హృదయములో దాచుకొమ్మని, తన ఒడిలో ఉంచనిమ్మని, వేడుకోవాలి ;

బస్సు ఆగింది.

ఆమె దిగింది.

నాకు తెలియకుండానే, నా చేయి టా . టా చెప్పింది. ఆమె నవ్వింది.

బస్సు కదలింది.

మూడు బస్సులు వెళ్ళిపోయాయి.

ఆమె ఇంకా రాలేదు. ఎందుకో ; బ్యాంకు మారిందా ?....లేక ఇల్లు మారిందా ; ఏమో ; చూడాలి మరి ;

నేను రాత్రి వచ్చినప్పటి నుండి, ఎప్పుడు తెల్లవారుతుందా అని చూశాను, ప్రొద్దున కాలేజికి పోయినప్పటి నుండి సాయంత్రం కోసం ఎదురు చూశాను.

సాయంత్రమయ్యింది.

ఆమె కొరకు చూస్తున్నాను. ఆమె ఇంకా రాలేదు. నేను చూస్తూనే వున్నాను. మరో బస్సు వెళ్ళిపోయింది.

ఎక్కడికి పోయిందో ; "సిటీ" లో లేదేమో ; ఏమో ; నా మనసు ఒప్పుకోవడం లేదు. మళ్ళీ ఆలోచనలు. ఇన్ని రోజులు ఎలా గడిపిందో ; నా కొరకు చూసిందేమో ; ఈ బస్సు "స్టాపు" లో నాలాగ ఎంత సేపు చూసిందో ; నన్ను తిట్టుకుందేమో ; ఆమె వచ్చాక మాట్లాడించాలి ; నన్ను క్షమించమని నన్ను తన వానిగా చేసుకొమ్మని వేడుకోవాలి ;

మావాళ్ళంతా, నేను ఎవరిని చేసుకున్న ఒప్పుకుంటాడు, ఆమె ఒప్పుకుంటే నా అదృష్టము....; ఆమె తప్పకుండా, ఒప్పుకుంటుందని, నా మనసు ఒప్పుకుంది.

మరో బస్సు వచ్చింది.

ఆమె ఇంకా రాలేదు.

చీకటి పడుతున్నది. సిటీలైట్లు వెలిగాయి.

బస్సులోనుండి జనం దిగుతున్నారు, కొందరు ఎక్కుతున్నారు. కొద్ది సేపట్లో బస్సు కదులుతుంది.

ఆమె వస్తున్నది.

పరిగెత్తుకుంటూ,

పయిటను సరిచేసుకుంటూ,

"వన్ మినిట్ ప్లీజ్ ;" కండక్టర్ ని

అర్థించాను.
ఆమె దగ్గరకు వస్తున్నది.
నేను ఆమెను చూస్తున్నాను.
నా మనస్సు తేలిక పడుతోంది
ఆమె దగ్గరికి వచ్చింది.
కాలు జారి పడబోయింది.
నేను నవ్వాను, ఆమె నవ్వింది.
ఆమె పయిట జారింది
నా చూపు జారింది.

నా గుండె ఆగింది.
ఎందుకు ?....
ఆమె మెడలో మంగళసూత్రం
మెరుస్తున్నది.
నా చేతులు వణికాయి.

నా పెదాలు వణికాయి. నోట మాట రాలేదు. ఆమెను వదిలాను.

నా కళ్ళు తిరుగుతున్నాయి. నా కాళ్ళ క్రింద భూమి జారిపోతున్నది.
నేను ఏమో అయిపోతున్నాను.
కళ్ళు చీకట్లు కమ్మాయి.
అంతా చీకటి. చీకట్లో ఆమె,
ఆమె మంగళసూత్రం నవ్వింది. నన్ను చూసి. నా పిచ్చికోరికలను చూసి.

ఏదో కారు హారన్ విని ఇహలోకానికి వచ్చాను చుట్టూ చూశాను. ఆమె లేదు. నవ్వులులేవు. చూపులులేవు, సువాసనలులేవు.
బస్సు ఎప్పుడో వెళ్ళిపోయింది.
బస్సు ఎక్కడికో వెళ్ళిపోయింది.
మనిషిలేదు.
మనసు లేదు.

# దీపావళి లేఖ

— డా॥ గంధం జోయెల్

ఈ దీపావళి రోజున
నీకేమని వ్రాయను తమ్ముడూ,
ఏ మతలబులు వ్రాయనింక
మతాబులధర పెరిగింది
కొనలేనని చెప్పనా ?
వచ్చుజీతం ఎంతయినా
చిచ్చుబుడ్లకు మిగలలేదనా ?
ధరలు ఆకాశాన్నంటుతున్న
తరుణంలో, మనిషి దిగ
జారిపోతున్నాడనా ?
ఏమిటి వ్రాయను తమ్ముడూ ?
పాలధర పెరిగిందని
పాపాయి ఏడుస్తున్నాడు
మనీపర్సు బరువు తగ్గిందని
మనవాళ్ళంతా ఏడుస్తున్నారు
చీకట్లో పెత్తందార్ల
కార్యకలాపాలు సాగుతూనేవున్నాయి
నరకాసుర సంతతి
నాల్గువైపులా వ్యాపిస్తూనేవుంది,
అందుకే ఈ దీపావళి రోజున
అంతా బాగుందని అందంగా
అబద్ధం ఆడలేను
ఈ దీపావళి రోజున
ఇంతకుమించి వ్రాయలేను